# ఆనందమానందమాయె...

## - కాకాని కమల

పుగాకు నలిపి చుట్టలు చుడుతూ ఇంటి ముందు అరుగుమీద కూర్చున్నాడు భూమయ్య.

పెండ్లం నాగులమ్మ చాటలో నువ్వులు పోసుకుని బాగుచేస్తూంది.

మధ్య మధ్య గాలివాటుకి చాటఎత్తి చెరుగుతున్నప్పుడు ఆమె చేతికున్న బంగారు కంకణాలు ఘల్లుఘల్లు మంటున్నాయి.

ట్రింగ్ ట్రింగ్ అంటు సైకిల్ బెల్ మోగించుకుంటు సందు మలుపు తిరుగుతున్నాడు పోస్టుమాన్ శివయ్య.

నాగులమ్మ మొగం చాటంత అయ్యింది.

''తపాలా వస్తుందయ్యోయ్. ఇయ్యాలన్నా పెళ్ళోరి దగ్గర్నుంచి ఉత్తరం వస్తుందేమో. ఆళ్ళు మన సరోజని చూసుకొని వెళ్ళి నెల్లాళ్ళు కావటంలేదూ?!'' అంది ఆశగా చెరగటం ఆపి మగనికేసి చూస్తూ.

''నెలమీద వారం దినాలు అవుతూంది వాళ్ళు మన పిల్లని చూసివెళ్ళి. ఇంతవరకు చిట్టి రాయలేదు. మధ్యవర్తి అయిపులేడు అడుగుదామంటే'' అన్నాడు చుట్ట కొరుకుతూ భూమయ్య. అంతలో శివయ్య దూరం నుంచే కేకపెట్టాడు.

''భూమయ్యగారు రోజూ అడుగుతున్నారు ఉత్తరం వచ్చిందా అని. ఇయ్యాల ఇంకా అడగరేం? మీకు ఉత్తరం వచ్చిందండి'' అంటు సైకిల్ దిగి ఇన్‌ల్యాండ్ కవరు కట్టలోంచి తీసి భూమయ్యకి అందించాడు.

ఫ్రం అడ్రస్ చూస్తూనే భూమయ్య ముఖం అంతా నవ్వు పులుముకుంది.

''దీనికోసమేనయ్యా ఎదురుచూస్తున్నది'' అంటు పక్కనేవున్న నాలుగు చుట్టలుతీసి శివయ్యకిచ్చి జేబులోంచి రెండు రూపాయల బిళ్ళ కూడా తీసి ఇచ్చాడు. చుట్టుప్రక్కల నాలుగు గ్రామాలకి శివయ్య ఒక్కడే పోస్టుమాన్.

''ఎక్కడనుంచయ్యా ఉత్తరం. కాకినాడ పెళ్ళారినుంచేనా?'' అంది నాగులమ్మ ఆత్రంగా.

''ఆ... ఆళ్ళదగ్గర్నుంచే'' అంటు భూమయ్య ఆత్రంగా కవరు చించాడు.

ఎంత ఆత్రంగా ఉత్తరం చించాడో అంతగానూ భూమయ్య ముఖం వెలా తెలా బోయింది.

ఉత్తరంలో రెండే వాక్యాలు-

''కొన్ని కారణాలవల్ల మీ సంబంధం ఒదులుకుంటున్నాము. మన్నించండి.''

- గోవర్ధనరావు, కాకినాడ.

మాటలు చెరుగుతున్నట్లు నాగులమ్మ చాటలా నోరు విప్పింది. ''ఏం మాయరోగం అంట? బంగారంలాంటి పిల్ల. మన సరోజకేం తక్కువయ్యిందని? మనకున్నది ఒక్క ఆడపిల్ల. కొడుకుతో సమంగా దానికి వాటా ఇస్తుంటిమి. ఇంతకంటే ఎక్కువ కోడలు దొరుకుతుందంటనా వాళ్ళకి'' నాగులమ్మ తాచులా బుసకొట్టింది.

''ఏందో అంతా చిత్రంగా ఉంది'' అన్నాడు భూమయ్య మునివేళ్ళతో బట్టతల సవరించుకుంటు.

భూమయ్యకి ఒక కొడుకు ఒక కూతురు. పొలం, పుట్ర, పాడి అంతో ఇంతో వెనక ఆస్థి బాగానేవుంది. తన ఆస్థిని కొడుకుతో సమంగా కూతురికి వాటా పంచుతున్నాడు. ఆ విషయం బాహాటంగా చెప్తున్నాడు. కొడుకు పట్నంలో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. కూతుర్ని కూడా పట్నం హాస్టల్‌లో పెట్టి డిగ్రీ దాకా చదివించాడు. వంటిడు నగలు చేయించాడు. పాతచీర కట్టుకున్న మహాలక్ష్మిలా కళకళ లాడుతూ చందమామలా ఉంటుంది సరోజ. డిగ్రీ పూర్తిచేసి వచ్చింది. ఏడాదినుంచి కాళ్ళకి బలపాలు కట్టుకుని పెళ్ళి సంబంధాలు వెదుకుతున్నాడు. కాని ఒక్కటి కుదరలేదు. మర్యాదగా చూపులకి వస్తున్నారు. పిల్లని చూస్తున్నారు. అక్కడికక్కడే నచ్చిందంటున్నారు. కట్నకానుకలు చూసి సంబరపడుతున్నారు. ఏ సంగతి ఇంటికెళ్ళి రాస్తాం అంటున్నారు.

''క్షమించండి మీ సంబంధం ఒదులుకుంటున్నాం'' అంటున్నారు. కారణం తెలియటంలేదు.

అప్పుడే ఊరంతా ఈ విషయం పాకుతుంది.

''భూమయ్య కూతురు సరోజకి పెళ్ళి కుదరటంలేదు. వచ్చిన ప్రతి సంబంధం వెనక్కి పోతూంది.'' గుసగుస లాడుకుంటున్నారు.

గ్రహచారం బాగాలేదని పూజలు చేయించాడు. అయ్యగార్ని పిలిచి జాతకచక్రం రాయించాడు. అన్నీ బాగానే వున్నాయి. మరింకేమిటి లోటు?

గ్రామంలో సరోజ గురించి వెనక ఏవో మాటలు వినిపిస్తున్నాయి.

కూతురి పెళ్ళి ఆలస్యం కావటంతో భూమయ్యలో పట్టుదల పెరిగి ఇంకా ఎక్కువగా సంబంధాలు చూస్తున్నాడు. వారానికి ఒకటి చొప్పున చూసుకోడానికి వస్తున్నారు. వెళుతున్నారు. కానీ ఒక్కటీ కుదరటంలేదు.

సరోజ ఊళ్ళోనే మేనరికం ఉంది. భూమయ్య ఇంటికి నాలుగు వీధుల అవతల వుంటుంది. భూమయ్యకి ఒక్కగానొక్క చెల్లెలు. సరోజ బావ శేఖరం కూడా పట్నం హాస్టల్‌లో ఉండి పైచదువులు చదివాడు. మంచి ఉద్యోగం కూడా ఈమధ్యనే వచ్చింది.

కానీ కుటుంబ కలహాలున్నాయి. అందుకని నాగులమ్మకి సరోజని మేనల్లుడికివ్వడం ఇష్టంలేదు. భూమయ్యకీ అంతంత మాత్రమే.

శేఖర్ తల్లి శాంతకి బాగా పట్టుదలగానే ఉంది. మేనకోడలంటే ఆపేక్ష వున్నా మాట పట్టింపుతో బిర్రుగా ఉంది.

రెండు కుటుంబాల పెద్దలు ఎప్పుడైనా ఎదురుపడితే ఏదో మొక్కుబడిగా పలకరించుకుంటారుగాని భూమయ్యకి శాంతకి మధ్య అన్నాచెల్లెళ్ళ బంధం ఎప్పుడో తెగిపోయింది. కడుపులో అక్కసు రగులుతూంది.

న్యాయంగా- శాంత పుట్టింటి నుంచి తనకి రావలసిన దానికంటే తల్లిని బులిపించి ఐదు ఎకరాల పొలం, ఇరవై తులాల బంగారం ఎక్కువ తీసుకుంది. అది చాలదన్నట్లు శాంత భర్త అంజిరెడ్డి భూమయ్యతో కాలుదువ్వి నోటికి వచ్చినట్లు మాట్లాడాడు. ఇంటల్లుడినన్న ధీమా వ్యక్తం చేశాడు.

దాంతో భూమయ్యకి అహం దెబ్బతింది.

అక్కడి నుంచి గొడవలు మొదలయ్యాయి.

ఏళ్ళు గడిచిపోతూంది. మళ్ళీ రెండు కుటుంబాలు ఏకం కావాలని మనసుల్లో వున్నా ఇద్దరిలో ఎవరూ మెట్టు దిగటంలేదు. కనీసం తనకొడుక్కి అడగటానికన్నా వస్తారేమోననుకుంది శాంత.

''నాకూతురికేం బంగారుబొమ్మ. చదివింది కూడా'' అంటు వేరే సంబంధాలు చూడటం మొదలెట్టాడు భూమయ్య.

''మీ చెల్లెలుకి ఆశెక్కువ. ఇంక పిల్లనిచ్చినామంటే మన్నికూడా తిన్నెయ్యదూ. ఎందుకులే మేనరికం'' అంటు వంతపాడింది నాగులమ్మ మెటికలు విరుస్తూ.

కాని ఏడాది నుంచి చూస్తున్నా ఒక్క సంబంధం కుదరటంలేదు.

ఊళ్ళో తలవంపుగా ఉంది.

''ఏమ్మా నాగులమ్మా. సరోజకి పెళ్ళిసూపులంటగా'' అంటు ఒంకరగా నవ్వుతూ అమ్మలక్కలు వ్యంగ్యంగా అడిగేవరకు వచ్చింది. ''ఏం ఇంకా కుదరలేదా?'' అంటు వాళ్ళల్లో వాళ్ళు ముఖాలు చూసుకుంటున్నారు. నాగులమ్మకి కంపరంగా ఉంది.

నిన్న ఉన్న తెగింపు ఇవ్వాళలేదు.

'అసలు పిల్ల పెళ్ళి చెయ్యగలమా?' అన్న భయం పట్టుకుంది.

చూపులకి రావటం, పిల్లని చూసి కట్నకానుకలు చూసి సంబరపడుతూ పెళ్ళి జరిగినట్లే మాట్లాడుతున్నారు. తీరా ఇంటికెళ్ళి విముఖత్వం చూపుతూ ఉత్తరం రాస్తున్నారు. నెమ్మదిగా ఈ విషయం గ్రామం అంతా పాకింది. అసలే పల్లెటూరు. రకరకాల గుసగుసలు

పోతున్నారు జనం.

''భూమయ్యా! ఉయ్యాల్లో బిడ్డని పెట్టుకుని ఊరంతా తిరిగినట్టు మేనల్లుడ్ని కాదని అసలు పరాయి సంబంధం కోసం ఎందుకు పోతున్నట్లు? నీకున్నది ఒక్క చెల్లెలు శాంతమ్మ. నువ్వూ ఒక్కగానొక్క అన్నవి. ఎందుకొచ్చిన తగాదాలు. కక్షలు. మా మాట విని సరోజని నీ మేనల్లుడికియ్యి. ఆడపిల్ల తండ్రివి నువ్వే వెళ్ళి అడగాలి. నువ్వు అడిగితే నీ చెల్లి కాదనదు. ఒకవేళ బిర్రు చూపిందే అనుకో. నచ్చజెప్పటానికి మేం అంతా లేమా?'' అంటు హితవు చెప్తున్నారు గ్రామపెద్దలు.

''ఏందయ్యా మాట్లాడవు. ఆ ఉత్తరం ఎంతసేపట్టా పట్టుకుని కూర్చుంటావ్?'' నాగులమ్మ భుజంపట్టి కుదుపుతుంటే- ''ఏంటే?'' అన్నాడు పరధ్యానంగా.

''ఆ మధ్యవర్తిని ఒక్కసారి వెళ్ళి అడగరాదూ. ఆళ్ళకేం మాయరోగం వచ్చిందో ఇట్టా ఉత్తరం రాశారు. మనపిల్లకేం తక్కువయ్యిందో?'' అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుంటు.

''సరే'' అంటూ లేచాడు భూమయ్య.

• • •

పాలెగాడ్ని పిలిచి బండి కట్టమని పక్క గ్రామానికి బయలుదేరాడు. మధ్యవర్తి ఉండేది పక్కగ్రామంలోనే.

భూమయ్య వెళ్ళేసరికి మధ్యవర్తి వెంకటేశ్వర్లు ఇంట్లోనే ఉన్నాడు.

''భూమయ్యా! నీబాధ నాకర్థం అయ్యింది. నేనే ఈఏడాదిలో ఓ పాతిక సంబంధాల దాకా తెచ్చాను. ఒక్కటి కుదరలేదు. అన్నీ బెడిసిపోతున్నాయి. కారణం నాకు తెలుస్తూనే ఉంది. కాని నీకెలా చెప్పాలో నాకు తెలియటంలేదు'' అన్నాడు నాన్చుతూ. భూమయ్య విస్తుపోయాడు.

''అదేమిటి?''

''అవును భూమయ్యా. నీబాధ చూస్తుంటే నాకు జాలేస్తుంది. ఇంక దాయటం మంచిదికాదు. అందుకే చెప్తున్నాను. గుండె నిబ్బరంగా విను. మీ అమ్మాయి ప్రవర్తన మంచిదికాదని పుకారు లేచింది. పట్నంలో వుండి చదువుకున్నన్ని రోజులు మగాళ్ళతో విచ్చలవిడిగా తిరిగేదిట. పెళ్ళిచూపులకి వచ్చిన సంబంధాలవాళ్ళు అందరికి ఈ విషయాలు ఆకాశరామన్న ఉత్తరాలు వెళుతున్నాయట.''

భూమయ్య ప్రాణం పోతున్నట్టు కేకపెట్టాడు.

''ఏందయ్యా నువ్వు చెప్పేది?'' అన్నాడు గాభరాగా అరుస్తున్నట్టు.

''అవును భూమయ్య. వాళ్ళందరికి ఆకాశరామన్న ఉత్తరాలు వెడుతున్నాయి. వాళ్ళు ఆ ఉత్తరాలు నాకు చూపించారు కూడా. ఆ సరోజ చాలా బుద్ధిమంతురాలు. మంచిది. ఎవరో గిట్టనివాళ్ళు పుట్టించి ఉంటారు. అని నేను నచ్చచెప్పటానికి ప్రయత్నించాను కూడా. కాని వాళ్ళు వినటంలేదు. నిప్పు లేకుండా పొగ వస్తుందా అంటున్నారు. ఇదీ పరిస్థితి.''

''భగవంతుడా?'' నెత్తిబాదుకున్నాడు భూమయ్య. తలకొట్టేసినట్లుగా అయి ఇంటికి వచ్చాడు.

• • •

ఆ రాత్రంతా నాగులమ్మ ఏడుస్తునే ఉంది.


''నాగి! నాకోటనిపిస్తుందే. ఊళ్ళో పెద్దలు చెపుతున్నారు. మేనరికం పెట్టుకుని బయట సంబంధానికెడితే ఇంటి ఆడపడుచు ఉసురు తగలదా అంటున్నారే నాగి. సరోజని శేఖరికి అడిగితే సరిపోదా! ఊరి పెద్దలు ఆమాటే అంటున్నారు'' అన్నాడు.

నాగులమ్మ కళ్ళు తుడుచుకుంది.

''ఇప్పుడు వెళ్ళి అడిగితే నీ చెల్లెలు ఊరుకుంటుందా? ఎక్కడా దొరక్క వచ్చాం అని నిష్ఠూరం ఆడదా? అసలే నీ చెల్లెలి నోరు దురుసు'' అంది.

''కానియ్యి. పరాయోళ్ళ చేత మాటలు పడేకంటే స్వంత చెల్లెలు ఓమాటంటేతప్పా. ఆడపిల్ల వాళ్ళం. ఏదన్నా పడక తప్పదు. ఊళ్ళో పెద్దలంతా శాంతమ్మని వెళ్ళి అడగమంటున్నారు. మంచి రోజు చూసి ఊరి పెద్దల్ని వెంటపెట్టుకుని అడుగుదామే. మన సరోజ ప్రవర్తన మంచిదికాదని ఏ పోకిరి ఎధవో ఆకాశరామన్న ఉత్తరాలు వేస్తున్నాట్ట. ఈ పుకారు ఊరు వాడ పొగరాకముందే మనం జాగరత పడటం మంచిది కదా'' అన్నాడు.

''సరే. అట్లే కానియ్యి. నాబిడ్డ కుశలంకంటే నాకు పంతాలు పట్టింపులు ఎక్కువకాదు. సరోజ కడుపున పుట్టిన ఆడపిల్ల అయితే శాంతమ్మ ఇంటి ఆడపిల్ల'' అంది నాగులమ్మ.



• • •

సరిగ్గా పదిహేను రోజుల తరువాత గ్రామపెద్దల సమక్షంలో సరోజకి అత్తకొడుకు శేఖర్‌తో పెళ్ళి లగ్నం ఖాయం అయ్యింది. పెళ్ళి తాంబూలాలు పుచ్చుకునే శుభకార్యమే పెళ్ళిలా జరిపించాడు భూమయ్య.

''చిన్నప్పట్నించి నన్ను మురిపించిన మా అత్తకూతురు నాకు దక్కకుండా ఎక్కడ పోతుందో అని భయపడ్డాను'' అన్నాడు శేఖర్ తమాషాగా కళ్ళు కదిలిస్తూ సరోజతో ఏకాంతంలో.

''మానాన్న నాకోసం పాతిక సంబంధాలు తెచ్చాడు. అన్నీ చెడిపోయాయి ఎందుకో తెలుసా బావా? నేను పట్నంలో వుండి చదువుకున్నన్నాళ్ళు ఎవరో మగాళ్ళతో తిరిగానుట. నా ప్రవర్తన మంచిదికాదని పెళ్ళివాళ్ళకి ఆకాశరామన్న ఉత్తరాలు వెళ్ళాయిట బావా'' అంది సరోజ కళ్ళు వింతగా తిప్పుతూ.

''అలాగా! కాని పట్నంలో నువ్వు తిరిగిన ఆ మగాడు నేనేనని, ఆ ఆకాశరామన్నని కూడా నేనే నని, విడిపోయిన మన కుటుంబాల్ని కలపటానికి మనం ఆడిన నాటకం ఇదని కూడా పాపం వాళ్ళకి తెలియదు'' అన్నాడు శేఖర్ సరోజ జడ పట్టి లాగుతూ.

పూలు విరిసినట్లు కిలకిలా నవ్వింది సరోజ.

ఆ నవ్వుని చూస్తు ముగ్ధుడయ్యాడు శేఖర్.

''ఆనందమానందమాయె..'' పందిట్లో మైకుసెట్లో పాట మోగుతూంది.

★